క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీలర్లు

రాజాం: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజశేఖరంను మండలానికి చెందిన పలువురు రేషన్ డీలర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.అన్ని వర్గాల ప్రజలను, రెవెన్యూ సిబ్బందిని సమన్వ యం చేసుకుని మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, స్థానిక ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. సీఎస్‌డీటీ చిరంజీవి పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన



బాలసదన్ వసతి గృహంలో ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న జడ్జి రోహిణీరావు

బొబ్బిలి: పట్టణంలోని ఎస్టీ బాలికల సంక్షేమ పాఠశాల వసతి గృహం, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, పాత బొబ్బిలిలోని బాలసదన్‌లను స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు గురువారం సాయంత్రం సందర్శించారు. హాస్టళ్లలో వంట శాలలు, స్నానపు గదులు, మరుగు దొడ్లను పరిశీలించారు. భవనాల పటిష్టతను తనిఖీ చేశారు. సంక్షేమాధికారులకు పలుసూచనలు చేశారు.

వైద్యుడికి సత్కారం



డాక్టర్ అప్పారావును సత్కరిస్తున్న జె.సి.రాజు, ప్రవీణ్‌కుమార్

బొబ్బిలి: పట్టణంలోని బొబ్బిలి ఐ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కె.వి.అప్పారావు ఇటీవల ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన్ని స్థానిక ఆస్పత్రిలో రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు, క్లబ్ కార్యవర్గ సభ్యులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, సన్మానించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



కేజీబీవీ విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓలు ఎం.వి. ప్రసాదరావు, బి. ఎరకయ్య గురువారం సందర్శించారు. దేవుదల గ్రామంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

37వ రోజుకు చేరిన సమ్మె



నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపాలిటీకి చెందిన ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 37వ రోజుకు చేరింది.కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ నెల రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయమని అన్నారు. తక్షణ మే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్‌కుమార్, నరసింగరావు, కృష్ణ, శారద, శ్రీనివాసరావు, దాసు, సోమేష్, సత్యనారాయణ, ప్రసన్న పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

సంతకవిటి: మాదవరాయపురం గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన స్థల వివాదంపై కొంచాడ బుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ వాసు తెలిపారు. పోలీసులు చెప్పిన వివరాలు.. కొంచాడ బుల్లమ్మ, కొంచాడ రామకృష్ణ కుటుంబాల మధ్య బుధవారం రాత్రి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే తనపై రామకృష్ణ కుటుంబ సభ్యులు ముగ్గురు దాడి చేశారంటూ బుల్లమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

అలంకార ప్రాయంగా కియోస్క్‌లు

- రైతు సేవా కేంద్రాల్లో నిలిచిపోయిన కియోస్క్ సేవలు
- ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం రైతులకు ఇక్కట్లు

రాజాం నియోజకవర్గంలో కియోస్క్ మెషిన్ల వివరాలు

మండలం	కియోస్క్ మెషిన్లు
రాజాం	21
రేగిడి	25
వంగర	19
సంతకవిటి	24

రాజాం: టీడీపీ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు ఎలాంటి సహకారం, సంక్షేమం అందడం లేదు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. పెట్టుబడి సాయం నుంచి, పంటల సాగు, మార్కెటింగ్ వరకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తూ అండగా నిలిచింది. వ్యవసాయం అంటే దండగ కాదు, పండగ అని నిరూపించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామ సచివాలయంలో పరిధిలో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ను ఏర్పాటు చేసి రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించారు. పంటలసాగుకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు అందించేవారు. లక్షల రూపాయలు వెచ్చించి ఆర్బీకేల్లో కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్)యంత్రాలను ఏర్పాటు చేసి, డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.రాజాం నియోజకవర్గంలోని 89 రైతు భరోసా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసి సేవలందించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. కూటమి ప్రభుత్వం ఆర్బీకేల పేరు మార్చేందుకు చూపించిన ఉత్సుకత... సేవలు అందించడంలో చూపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ కియోస్క్ సేవలు నిలిచిపోయాయి.

సేవలు అందేవి ఇలా..

రైతే స్వయంగా కియోస్క్ మెషిన్ వద్ద నిలబడి తనకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చుకునే వారు. ఏటీఎంలను పోలి, ఆండ్రాయిడ్ సాంకేతి క పరిజ్ఞానంతో నడిచే ఈ మెషి న్ డిస్‌ప్లేలో రైతులు తమ ఆధార్, ఫోన్ నంబర్‌ను నమోదు చేసిన వెంటనే



రాజాం మండలం పొగిరి రైతుసేవా కేంద్రంలో వినియోగంలో లేని కియోస్క్

డిజిటల్ సేవలు ప్రారంభమయ్యేవి. తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వివరాలను రిజిస్టర్ చేసుకునే వారు. రిజిస్టర్ అయిన తర్వాత మొబైల్‌కు ఓటీపీ వచ్చేది.అక్కడే ఫోన్ పే, లేదా క్యూఆర్ కోడ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ పూర్తి చేసేవారు. ఈ ప్రక్రియ ముగిసిన 48 నుంచి 72 గంటల్లోగా వారు బుక్ చేసుకున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఆర్బీకేలకు చేరేవి. ఈ సమాచారం రైతుల ఫోన్‌లకు సంక్షిప్త సందేశం ద్వారా అందేది. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వచ్చి వాటిని తీసుకుని వెళ్లేవారు. ఈ మొత్తం విధానంలో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండడం వల్ల నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందేవి. కమిషన్లు, అధిక చెల్లింపులకు అవకాశం ఉండేది కాదు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరల వివరాలను ఈయంత్రం ద్వారా తెలుసుకునేవారు.సాగు యాజమాన్య పద్ధతులకు సంబంధించిన సంక్షిప్త వీడి యోలు, వాతావరణ సమాచారం, ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలనే వివరాలను ఈ కియోస్క్ ద్వారా తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, సంక్షేమాన్ని ఒక్కొక్కటిగా తుడిచిపెట్టే కార్యక్రమం కూటమి సర్కారు చేస్తోంది.

రైతు సంక్షేమానికి తూట్లు



గతంలో రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ మెషిన్ల ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు విత్తనాలు, ఎరువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే వారు. ప్రస్తుతం ఈ మెషిన్లు పనిచేయడంలేదు. ఏ వివరాలూ అందులో లేవు. రైతు సేవా కేంద్రాల్లోనూ సరిగా సేవలు అందడం లేదు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. టీడీపీ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి తూట్లు పొడుస్తోంది.

– ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, ఎంపీపీ, వంగర మండలం.

గతంలో సేవలందేవి.



గతంలో వ్యవసాయం పండగలా ఉండేది. పెట్టుబడి సహాయం అందేది. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతు సేవా కేంద్రాల్లో లభించేవి. కియోస్క్ మెషిన్లలో ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకునే వారం. ఇప్పుడు అక్కడ మెషిన్లు పనిచేయడం లేదు. వీఏఏలు వారి ఫోన్ల ద్వారా బుక్‌చేస్తున్నారు.

– కరణం శ్రీనివాసరావు, రైతు, అప్పాపురం, రేగిడి మండలం

మొబైల్స్ ద్వారా సేవలు



కియోస్క్ మెషిన్లు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.వాటి సాఫ్ట్‌వేర్ లింక్ ఆయా కేంద్రాల వీఏఏల ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో ఉన్నాయి. అందులో స్టాక్ వివరాలు తెలుస్తున్నాయి. రైతులు వారి వద్ద ఈ సేవలు పొంద వచ్చు. కియోస్క్‌ల వినియోగ పరిజ్ఞానం గ్రామాల్లో పెద్దగా లేకపోవడంతో వాటి వినియోగం తక్కువగా ఉంది.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ అజూ రఫీజాన్

రామభద్రపురం: మండల తహసీల్దార్‌గా అజూ రఫీజాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సులోచనరాణి మెరకముడిదాం మండలానికి బదిలీపై వెళ్లగా, మెరకముడిదాం నుంచి రఫీజాన్ ఇక్కడికి వచ్చారు. మండల రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకి స్వాగతం పలికారు.

సంతకవిటి తహసీల్దార్‌గా సుదర్శనరావు



తహసీల్దార్ సుదర్శనరావు

సంతకవిటి: సంతకవిటి తహసీల్దార్‌గా బి.సుదర్శనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి.సత్యం శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లడంతో నెల్లిమర్ల నుంచి సుదర్శనరావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయనకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

బాడంగి ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా దాస్



వార్డెన్ దాస్

బాడంగి: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహం సంక్షేమాధికారి(వార్డెన్)గా ఎస్.దాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ వార్డెన్‌గా పని చేసిన ఎం.రాంబాబుకు బదిలీకాగా ఆయన స్థానంలో దాస్ నియమితులయ్యారు.పక్కనే ఉన్న బీసీ వసతి గృహానికి ఈయనే ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

తెర్లాం సర్వేయర్‌గా అప్పలనాయుడు



సర్వేయర్ అప్పలనాయుడు

తెర్లాం: మండల సర్వేయర్‌గా జి.అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు ఆయన గురువారం తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌ను కలిసి విధుల్లో చేరారు. సంతకవిటి మండలం నుంచి ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా



కొండకెంగువ గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కొత్త వాహన చట్టం ప్రకారం తప్పనిసరిగా రూ.10 వేల అపరాధ రుసుం చెల్లించాల్సిందేనని బొబ్బిలి సీఐ కె.నారాయణరావు అన్నారు.మండలంలోని కొండకెంగువ గ్రామంలో ప్రజలు, యువకులతో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. కొత్త వాహన చట్టాలు,రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలు,మాదక ద్రవ్యాల అక్రమరవాణా నివారణ, వాటి వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన అయిదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ సాలూరు కోర్టు జడ్జి తీర్పునిచ్చారని చెప్పారు. సైబర్ నేరాలు రోజురోజుకూ ఎక్కువవు తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొరియర్ పేరుతోనూ మోసాలు జరుగుతున్నాయని, చైల్డ్‌పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్‌యాప్,హనీ ట్రాప్, లాటరీల పేరుతో, ఇన్‌స్టాగామ్ మోసాలు,వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయింగ్, తదితర నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని చెప్పారు.

మొక్కల పంపిణీ



నర్సరీ నుంచి మొక్కలు తీసుకువెళుతున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు

తెర్లాం: మండల కేంద్రానికి సమీపంలోని అటవీశాఖ నర్సరీలో పెంచిన మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నాటేందుకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మండలంలోని 33 పంచాయతీల్లో చెరువు గట్లు, జగనన్న కాలనీలు, రోడ్డు పక్కన మొక్కలు నాటేందుకు అధికారు లు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే నర్సరీ నుంచి మొక్కలను తీసుకువెళ్లి గ్రామాల్లో నాటించేందుకు ఉపాధి క్షేత్ర సహాయకులు కృషి చేస్తున్నారు. గ్రామాల నుంచి ఆటోల్లో వచ్చి నర్సరీ నుంచి మొక్కలు తీసుకుని వెళుతున్నారు. నర్సరీ నిర్వాహకుడు రమణ మాట్లాడుతూ అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు మొక్కలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఎవరో వస్తారని.. ఎదురు చూడకుండా..

- సొంత నిధులతో పూడిక తొలగింపు



సాయన్నచానల్‌లో జేసీబీతో పూడిక తీయిస్తున్న రైతులు

రేగిడి: ప్రభుత్వం చేయించాల్సిన పనిని గత్యంతరం లేక రైతులే చేసుకోవాల్సి రావడం బాధాకరం. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఖరీఫ్‌లో పంటపొలాలకు పూర్తిస్థాయిలో నాగావళి నీటిని మళ్లించుకునేందుకు రైతులే స్వతహాగా పనులు చేసుకుంటున్నారు. సాయన్నచానల్‌కు ఇటీవల పుర్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పాలవలస సూర్యారావు, కురిటి రామకోటి తమ సొంత నిధులతో షట్టర్లు ఏర్పాటు చేసిన విషయం విధితమే. నాగావళి నది నుంచి పుర్లి గ్రామం వరకు సాయన్నచానల్ తుప్పలు, పూడికతో పేరుకుపోయింది. దీంతో రైతులు సూర్యారావు, రామకోటి, పాలవలస రమణ నిధులు సమకూర్చుకుని కాలువలో పూడిక, తుప్పల తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. ఆయకట్టు పరిధిలో సుమారు 3వేల ఎకరాలకు సక్రమంగా సాగు నీటిని అందించేందుకు జేసీబీతో పూడిక,తుప్పలను తొలగిస్తున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో తామే పూడిక తీత పనులు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది

వంగర: రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం వివిధ శాఖల అధికారులు, యువకులు, పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. యోగాతో కలిగే ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వండానపేటలో విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ అందజేస్తున్న లక్ష్మీపురం హైస్కూల్ ఉపాధ్యాయులు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందుతుందని మండలంలోని లక్ష్మీపురం, ఏ.వి.పురం, కందిశ, లింగాలవలస ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్క గ్రామాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు గురువారం ఇంటింట ప్రచారం చేశారు. అయిదోతరగతి పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. . అన్ని తరగతులకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉన్నారని, పాఠ్యపుస్తకాలు కూడా అందజేస్తామని అన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్న ట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

రాజాం: ఉద్యానవన పంటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని ఉపాధి హామీ ఈసీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ఉద్యాన వన పంటల సాగు, ఉపాధి హామీ పథకం ద్వారా అందించే సహాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. 5 ఎకరాల్లోపు భూములున్న రైతులకు ఉచితంగా మామిడి, జీడి, జామ, పనస, కొబ్బరి మొక్కల పంపిణీతో పాటు వాటి సంరక్షణకు మూడేళ్ల పాటు వేతనాలు ఇస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న రైతులు తమ ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు చేయించాలి

రేగిడి: గ్రామాల్లో తప్పనిసరిగా తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి పంచాయతీ కార్యదర్శులను గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు.వర్షాలు కురుస్తున్నందున కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోయే అవకాశం ఉంటుందని, వాటిని తొలగించే పనులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ నిధులతో బ్లీచింగ్ కొనుగోలు చేసి, మురుగు కుంటల వద్ద చల్లించాలని దిశా నిర్దేశం చేశారు.

సామూహిక అక్షరభ్యాసం



వంగర: మండల కేంద్రం వంగర అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులతో అక్షరభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వంగర: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదుర్గ ఆధ్వర్యంలో చిన్నారులతో గురువారం సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 4 సంవత్సరాల్లోపు చిన్నారులను ప్రీప్రైమరీ, 4 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులను ప్రీ ప్రైమరీ–2గా విభజించి విద్యాభ్యాసం చేస్తున్నట్లు చెప్పారు. పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తున్నామని, తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు టి.శశికళ, వెంకటరత్నం, ఎస్.కుమారి, తదితరుల పాల్గొన్నారు.



బొబ్బిలి పట్టణంలోని రావువారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో..



బొబ్బిలి రూరల్: రంగరాయపురంలో...

బొబ్బిలిలో..

బొబ్బిలి/బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణంలోని రావువారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో, మండలంలోని పక్కి, రంగరాయ పురం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం అక్షరాభ్యాసాలు జరిపారు. సంప్రదాయ పద్ధతిలో పురోహితుల సమక్షంలో అక్షరాభ్యాసాలు చేయించారు.

రైతన్నలు బిజీ బిజీ

తొలకరి వర్షాలు కురియడంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ముందస్తుగానే వరి విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు నారుమడులు తయారీ పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే దుక్కులు పూర్తి చేసిన రైతులు విత్తనాలు విత్తే పనిలో పడ్డారు.కొన్ని చోట్ల రైతులు మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటుతున్నారు. వరి సాగు చేయనున్న పొలాలకు సంబంధించిన గట్లను పటిష్టం చేస్తున్నారు. కొందరు కూరగాయల పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

– రామభద్రపురం/వంగర



వంగర: కొప్పరలో పొలం గట్లను పటిష్టం చేస్తున్న రైతు కూలీలు



రామభద్రపురం: రొంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు



రామభద్రపురం: కోటశిర్లాంలోమొక్కజొన్న పంటకు తారెలు తీస్తున్న రైతు కూలీలు



వంగర: కొండచాకరాపల్లిలో దుక్కి చేస్తున్న రైతు

సిగ్నల్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు

- రెండు జంక్షన్లలో పరిశీలించిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- పోలీసుశాఖకు ప్రతిపాదనలు



అంబేడ్కర్ జంక్షన్ వద్ద మోడల్ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు



అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఏర్పాటుచేయనున్న సిగ్నల్ సిస్టమ్ నమూనా

రాజాం: అన్ని విధాలా అభివృద్ధిచెందుతున్న రాజాంలో ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యాయి. వీటిని అధిగమించేందుకు ఇప్పటికే రోడ్డు విస్తరణ చేపడుతున్నారు. ఈరోడ్డు విస్తరణ నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 40 కోట్లు, ఇరువైపులా నిర్వాసితులు, వ్యాపారులకు పరిహారం నిమిత్తం రూ. 80 కోట్లు మేర నిధులు కేటాయించింది. ఇప్పుడు ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రెండుచోట్ల నమూనా ట్రాఫిక్ సిగ్నల్స్ విధానాన్ని గురువారం పరిశీలించారు.

కొత్త హంగులతో...

రాజాంలో ప్రధానంగా అంబేడ్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ట్రాఫిక్ అధికంగా ఉంటుండంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఒకే సమయంలో తెరవడం, మూయడం చేస్తుంటారు. దీంతో ఆయా సమయాల్లో ఎక్కువ ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు అంబేడ్కర్ జంక్షన్ వద్ద వృత్తాకార ట్రాఫిక్ సిగ్నల్స్ కూడలి ఏర్పాటుకు మున్సిపల్ శాఖ ప్రతిపాదనలు తయారు చేసింది. అందంగా నమూనాలు రూపొందించింది. ఆకర్షణీయమైన హంగులతో ఇక్కడ ఏర్పాట్లు చేస్తోంది. ఇక్కడ నుంచి కిలోమీటరు దూరంలో ఉండే బొబ్బిలి జంక్షన్ వద్ద ఇదే తరహాలో ట్రాఫిక్ కూడలికి ఏర్పాట్లు చేస్తుంది. ఇక్కడ కూడా వృత్తాకరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేసి, వాటి వద్ద అందమైన వాటర్‌పాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది.

మోడల్ పరిశీలన

ఇదిలా ఉండగా గురువారం అంబేడ్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిమిత్తం ఏర్పాటుచేయనున్న ప్రాంతాన్ని మున్సిపల్ టీపీఓ తేజేశ్వరరావు తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. కేంద్రం నుంచి చుట్టు పక్కల దూరాన్ని ఆరాతీయడంతో పాటు కేంద్రం వద్ద కావాల్సిన స్థలాన్ని కొలతలు వేశారు. ఇసుక బస్తాలను నమూనా కూడలిగా పెట్టి వాహనాలను మళ్లించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఈ విధానం అనువుగా ఉండడంతో ఈరెండు చోట్ల సిగ్నల్స్ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుతో కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని ఆర్డీ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్‌కు, పోలీస్ శాఖకు పంపించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు టీపీఓ వెల్లడించారు.